సాక్షి ఒడిశా

గురువారం । 21 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,10,064లు, బంగారం 30 మిల్లీగ్రాములు, వెండి 6గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మహాత్ముని బాటలో పయనిద్దాం

మహాత్మాగాంధీ బాటలో పయనించి సుసంపన్న సమ్మిళిత సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రజలకు పిలుపునిచ్చారు.

- 8లో



రెండు చిల్డ్రన్ హోమ్స్ రద్దు

గజపతి జిల్లాలో గుసాని సమితిలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ చిల్డ్రన్ హోస్టల్స్, హోమ్స్‌ను నిషేధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



కింగ గ్రామస్తులతో మాట్లాడుతున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గజపతి జిల్లా కాశీనగర్ సమితిలో కింగ గ్రామం జల దిగ్బంధంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా బుధవారం పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కాశీనగర్ ప్రాంతంలో వరద ప్రాంతాలలో పర్యటించి రైతులు, ప్రజల సమస్యలను విన్నారు. భారీగా పంట నష్టం వాటిల్లినందున తమను ఆదుకోవాలని కింగ గ్రామస్తులు విన్నవించారు. కాశీనగర్ – కింగ గ్రామానికి అనుసంధానమైన పాత వంతెన ఎత్తును పెంచాలని విజ్ఞప్తి చేశారు. గుమ్మ గెడ్డతో వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



అరెస్టయిన నిందితులతో అబ్కారీ సిబ్బంది

జయపురం: అక్రమంగా నాటు సారా అమ్మేందుకు తీసుకెళ్తున్న ఒక మహిళతో పాటు మరొకరిని వేర్వేరు ప్రాంతాలలో అరెస్టు చేసినట్లు జయపురం అబ్కారి విభాగ అధికారి సుబ్రతా కేశరి హిరన్ బుధవారం తెలిపారు.అరెస్టు అయిన వారు జయపురం సమితి బర్లాహండి గ్రామానికి చెందిన దుర్యోధన బిశాయి, రాణీపుట్ ప్రాంతానికి చెందిన మహిళ ఉన్నారన్నారు. ఇద్దరిపైన కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. తాము మంగళవారం తమ సిబ్బందితో జయపురం సమితిలోని పలు ప్రాంతాలలో పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో రొండాపల్లి ప్రాంతాలలో సారాను విక్రయించేందుకు తీసుకొని వెళ్తుండగా ఇద్దరు పట్టుబడినట్టు పేర్కొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన సంతోష్, సురేష్

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమలాభట్ట సమీపంలో బుధవారం చోటుచేసుకోగా.. బుటి సంతోష్, సురేష్ కులిసికలు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మునిగుడ నుంచి బైకుపై రాయగడ వైపు వస్తున్న సురేష్, సంతోష్‌లు అమలాభట్ట కూడలికి చేరేసరికి ఎదురుగా వస్తున్న బొలేరో అదుపుతప్పి ఢీకొట్టంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బైకు కున డుపుతున్న సంతోష్ స్వల్ప గాయాలతో బయటపడగా.. వెనుక కూర్చున్న సురేష్‌కు తీవ్రగాయాలైనట్టు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రయాణికుల భద్రతపై ఆరా



భద్రక్ రైల్వే స్టేషన్ యార్డు పర్యవేక్షణలో జీఎం పరమేశ్వర్

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ 22823 న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల సౌకర్యాలు, పరిశుభ్రత, సేవా నాణ్యత, భద్రతా చర్యలు తనిఖీ చేశారు. అనంతరం భద్రక్ రైల్వే స్టేషన్ సందర్శించి ప్లాట్ ఫారంపై సౌకర్యాలు, సిబ్బంది లాబీని పరిశీలించారు. యార్డు కార్యాచరణ సామర్థ్యంపై దృష్టి సారించారు.

నవీన్‌కు ప్రధాని పరామర్శ

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం కుదుటపడ్డాక న్యూ ఢిల్లీలో కలుద్దామని అన్నారు. స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో నవీన్ పట్నాయక్ చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

ముచ్చటగా మూడు



పనులపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- అయోధ్య, హైదరాబాద్, సూరత్‌లో కొత్త ఒడిశా భవనాలకు ప్రతిపాదన
- ఢిల్లీలో ఒడిశా భవన నిర్మాణంపై ముఖ్యమంత్రి సమీక్ష

భువనేశ్వర్ :

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మూడు చోట్ల ఒడిశా భవనాలను నిర్మించాలని యోచిస్తోంది. ఈ ప్రతిపాదిత ప్రాంతాల్లో అయోధ్య, హైదరాబాద్, సూరత్ చోటుచేసుకున్నాయి. న్యూఢిల్లీ చాణక్యపురి ప్రాంతంలో కొనసాగుతున్న ఒడిశా భవన్ నిర్మాణం పనులు, పురోగతిని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం స్థానిక లోక్ సేవా భవన్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా వారసత్వాన్ని ప్రతిబింబించేలా కొత్త భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటిలో సంప్రదాయ రాతి కళా నైపుణ్యం, సంబల్‌పురి ఇకత్, ఒడిశా సాంస్కృతిక మూలాంశాల్ని ప్రతిబింబించే రీతితో నిర్మాణ ప్రణాళిక ఖరారు చేశారు. ఈ భవన నిర్మాణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

- సువిశాల 4,761 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల (జి+6)తో న్యూ ఢిల్లీలో ఒడిశా భవనం నిర్మాణం జరుగుతోంది. ఈ భవన సముదాయంలో 45 గదులు, సూట్‌లతో పాటు ఆధునిక సమావేశ హాలు కలిగి ఉంటుంది.
- దేశంలో ప్రముఖ ప్రాంతాల్లో ఒడిశా భవనాల నిర్మాణం, అభివృద్ధి, విస్తరణ పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. ముంబై ఒడిశా భవన్‌లో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్నందున, అక్కడ మరిన్ని గదులు పెంచాలని యోచిస్తున్నారు. కోల్‌కతాలో ఒడిశా భవనం పునరుద్ధరణ, ఆధునీకరణ చేపట్టాలని అధికారులకు తెలిపారు.
- అయోధ్య, హైదరాబాద్, సూరత్‌లలో కొత్త ఒడిశా భవనాలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆయా ప్రాంతాలకు పలువురు ఒడియా ప్రజలు తీర్థ యాత్ర ఇతరేతర వ్యవహారాల కోసం తరచు సందర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రజల సౌలభ్యం కోసం ఆ ప్రాంతాల్లో ఒడిశా భవనాల నిర్మాణం అవసరం పెరుగుతుందన్నారు.



న్యూఢిల్లీలో నిర్మాణంలో ఉన్న ఒడిశా భవన్

పోలవరం ప్రాజెక్టుతో మల్కన్‌గిరి మునక



కేంద్ర జల సంఘం ప్రముఖులతో సమావేశమైన బీజేడీ ప్రతినిధి బృందం

- పనులు ఆపాల్సిందే
- సీడబ్ల్యూసీకి బీజేడీ వినతి

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కారణంగా మల్కన్‌గిరిలోని అనేక ప్రాంతాలు మునిగిపోతాయని, ఈ ప్రాజెక్టు తీర ప్రాంతం గిరిజనుల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని బిజూ జనతా దళ్ బృందం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) దృష్టికి తీసుకెళ్లింది. పోలవరం ప్రాజెక్టుతో ఒడిశాకు తలెత్తే సమస్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రం సమర్పించింది. ఈ దిశలో తక్షణ చర్యలు తీసుకోవాలని అభ్యర్థించింది. తగిన సంప్రదింపులు లేకుండా సవరించిన వరద ముంపు ప్రామాణికలతో పొరుగు రాష్ట్రం యథేచ్ఛగా పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగిస్తోందని విపక్ష బీజేడీ అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. తాజా జల సంబంధ అంచనాలు, సమగ్ర వాటాదారుల సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఆంధ్ర ప్రదేశ్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని విన్నవించింది. మల్కన్‌గిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలను బ్యాక్ వాటర్ ప్రభావాలు ముంచెత్తి తీర ప్రాంతంలో గిరిజన వర్గాల్ని నిరాశ్రయులుగా మార్చుతుందని చెప్పింది. 2024 నుంచి పదే పదే చేస్తున్న అభ్యర్థనల్ని పెడచెవిన పెట్టి భద్రత, పునరావాసం, డిజైన్ సమస్యలను పరిష్కరించకుండా పొరుగు రాష్ట్రం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనుల్ని నిరవధికంగా కొసాగించడం తగదన్నారు. అత్యవసర ప్రజా ప్రయోజనానికి సంబంధించిన విషయంగా పరిగణించి నిబంధనల ఉల్లంఘనతో కొనసాగుతున్న పోలవరం ప్రాజెక్టు పనులు పని నిలిపివేతకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు సంబంధిత అన్ని వాటాదారుల రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి తాజా బ్యాక్ వాటర్ అధ్యయనం చేపట్టాలని ప్రతినిధి బృందం అభ్యర్థించింది.

వరద అంచనాల్లో మార్పులతో ముప్పు..

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి వరద పొంగు అంచనాల రూపకల్పనలో తరచు చోటు చేసుకుంటున్న మార్పులతో ముంపు ముప్పు తీవ్రతరం అవుతుందని వివరించారు. 1970లో 36 లక్షల క్యూసెక్కుల డిజైన్ వరదకు అనుమతిచ్చిన ఈ ప్రాజెక్టును 2006 లో 50 లక్షల క్యూసెక్కులకు సవరించారు. ఎగువ పరీవాహక (అప్ స్ట్రీమ్) రాష్ట్రాలతో తగిన సంప్రదింపులు, తాజా బ్యాక్ వాటర్ విశ్లేషణ లేకుండా ఈ మార్పులు చేపట్టడం పట్ల బిజూ జనతా దళ్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. గతంలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ చర్యలు ఒడిశాలో గరిష్ట బ్యాక్ వాటర్ స్థాయి ఆర్.ఎల్. 174.22 అడుగులను 36 లక్షల క్యూసెక్కులుగా పరిగణించినట్లు బీజేడీ ప్రతినిధి బృందం కేంద్ర జల సంఘానికి గుర్తు చేసింది.

బీజేడీ వాదన..

2009 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధ్యయనం, 2019 ఐఐటీ రూర్కీ అంచనాతో సహా తదుపరి నిర్వహించిన పరిశీలనలో 50 లక్షల క్యూసెక్కుల వద్ద ఆర్. ఎల్. 216 అడుగులు, 58 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద (పీఎంఎఫ్) వద్ద ఆర్.ఎల్. 232.28 అడుగులుగా గుర్తించాయి. ఈ గణాంకాలు నిజమైతే మల్కన్‌గిరి ముంపు తథ్యమనే సంకేతాలు బలపడతాయని బీజేడీ వాదిస్తోంది.

బీజేడీ విన్నపం..

సీడబ్ల్యూసీ నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సంప్రదింపులను బిజూ జనతా దళ్ ప్రతిపాదించింది. ఒడిశా నదుల కోసం ఎగువ పరీవాహక బ్యాక్ వాటర్ గణనలు ఎప్పుడైనా నిర్వహించబడ్డాయా లేదా అనే దానిపై నిర్ధారణ, గరిష్ట వరద సంఘటనలకు స్పిల్‌వే డిశ్చార్జ్ సామర్థ్యం, జలాశయం నిర్వహణ నియమాలపై స్పష్టత కోరింది. ఈ దిశలో జల సంఘం నికరమైన అభిప్రాయానికి వచ్చేంత వరకు 50 లక్షల క్యూసెక్ వరదల అంచనా ప్రామాణికంతో కొనసాగుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయాలని విన్నవించింది.

వార్షిక ఫీజులు పెంపు

పర్లాకిమిడి: ఒడిశాలో 2025–26 విద్యాసంవత్సరంలో అన్ని ప్రైవేటు మెడికల్ కళాశాలలో వార్షిక ఫీజులు తప్పనిసరిగా పెంచాల్సి వచ్చిందని ఒడిషా ప్రైవేటు మెడికల్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం భువనేశ్వర్‌లో హైటెక్ మెడికల్ కళాశాల కాన్ఫరెన్సు హాలులో వారు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ప్రైవేటు మెడికల్, డెంటల్ కోర్సుల ఫీజులు పెంచాల్సి ఉన్నా ఏడేళ్ళుగా ఒడిషాలో మెడికల్ కోర్సుల ఫీజులు రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదన్నారు. రోగుల ఆరోగ్య సేవలు, చికిత్సా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కళాశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు ఒడిషా ప్రైవేటు, ఇంజినీరింగ్ కళాశాలల చట్టం 2007 ప్రకారం తప్పనిసరి పరిస్థితుల్లో కోర్సుల ఫీజుల పెంపునకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రికి సిఫారసు చేసినట్లు తెలిపారు. సమావేశంలో హైటెక్ మెడికల్ కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ గోపేశ్వర్ ఆచార్య, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జ్యోతిర్మయి పండా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపేశ్వర్ ఆచార్య, జ్యోతిర్మయి పండా

బాలల హక్కులపై అవగాహన అవసరం

- సామాజికవేత్త సీహెచ్ శాంతాకర్



బాలల హక్కులపై ప్రసంగిస్తున్న సామాజిక వేత్త శాంతాకర్

కొరాపుట్: బాలల హక్కులపై అధికారులకు అవగాహన ఉండాలని కొరాపుట్ జిల్లాకి చెందిన బాలల హక్కులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించే సామాజిక వేత్త సీహెచ్ శాంతాకర్ అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో బాలల హక్కులపై బుధవారం నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగపరంగా బాలల సంరక్షణకు కల్పిస్తున్న హక్కులను వివరించారు. బాల్య వివాహాలు అరికట్టడం ద్వారా ఇలాంటి కార్యక్రమాలు మరింత ముందుకు వెళ్తుందన్నారు. పోక్సో చట్టంపై క్షుణ్ణంగా అవగాహనకు రావాలసిన అవసరం ఉందన్నారు. బాలకార్మిక వ్యవస్థను అరికట్టే విధంగా అధికారులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని శాంతాకర్ పేర్కొన్నారు. శిబిరంలో కార్మిక, శిశు సంక్షేమ, పోలీసు, సాంఘిక సంక్షేమ, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునిగుడ బంద్ ప్రశాంతం



ఎస్‌పీసీగా గుర్తించాలని ఆందోళన చేస్తున్న మునిగుడ వాసులు

రాయగడ: పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ జిల్లా మునిగుడ సమితిని ఎస్‌పీసీగా గుర్తించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో బుధవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ కారణంగా పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. వాహనాల రాకపోకలను ఆందోళనకారులు నిలిపివేశారు. గత బీజేడీ ప్రభుత్వ హయాంలో మునిగుడను ఎస్‌పీసీగా గుర్తించినట్లు ప్రకటించినప్పటికీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఎస్‌పిసి జాబితాలో విస్మరించిందని మునిగుడ ప్రగతి మంచ్ అధ్యక్షులు సీహెచ్ గణేశ్వరరావు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి మునిగుడను ఎస్‌పిసిగా గుర్తించాలని కోరారు. లేదంటే భవిష్యత్‌లో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



బంద్ కారణంగా నిలిచిపోయిన వాహనాలు

ఇద్దరు దొంగలు అరెస్టు



దొంగతనం కేసులో అరెస్టయిన నిందితులు


- చోరీసొత్తు స్వాధీనం

జయపురం: దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు జయపురం పట్టణ పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం హటొపాదర్ వాసి రింకు బెనియ, జయపురం వాసి సుశాంత ఖండపాణి ఉన్నారని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్రరౌత్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద నుంచి ఎనిమిది గ్రాముల బంగారు బిస్కెట్టు, ఒక జత బంగారు చెవి దుద్దులు, రెండు వెండి దీపపు కుందులు, రెండు వెండి ప్లేట్‌లు, ఒక వెండి చెంబు, రూ. 20 వేల నగదు, ఒక పల్సర్ బైక్, ఒక టాటా ట్రిగ్గార్ కార్, రెండు ఇనుప రాడ్లు, ఒక స్క్రూ డ్రైవర్ సీజ్ చేసినట్లు వెల్లడించారు. జయపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధి పవర్ హౌస్ కాలనీ సమీప బికాశ్ బిద్యాలయ నివాసి బాబూజీ పట్నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో దొంగలు చొరబడి ఆస్తులను చోరీ చేశారు. ఈ నెల ఏడు తేదీన తమ ఇంటి పక్కన ఉంటున్న వారు తమకు ఫోను చేసి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పట్నాయక్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే తాము జయపురం వచ్చి చూడగా ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించి తమకు ఫిర్యాదు చేసినట్టు పోలీసు అధికారి వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. దొంగలు పట్టుబడినట్టు వివరించారు.



నిందితుల నుంచి స్వాధీనం చేస్తున్న బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు

కోతకు గురవుతున్న నాగావళి తీరం!



జారిపడుతున్న రాళ్లు

- భయాందోళనలో ప్రజలు
- నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

రాయగడ: కొద్ది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సదరు సమితి బొడో రాయిసింగి గ్రామ సమీపంలో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తీర ప్రాంతం కోతకు గురవుతుంది. పెద్ద బండరాళ్లు, మట్టిపెళ్లలు జారి పడుతున్నాయి. నదీ ప్రవాహం ఉధృతం కావడంతో గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ తీర ప్రాంతాలు కోతకు గురవ్వకుండా యంత్రాంగం చేపట్టిన చర్యల్లో భాగంగా గత ఏడాది బొడోరాయిసింగి నదీ తీర ప్రాంతంలో సురక్షిత గట్లను జల సంపద విభాగం చేపట్టింది. సుమారు 7.16 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాంతంతో రాళ్లతో పనులను చేపట్టారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రాళ్ల ప్యాకింగ్ నాణ్యత కోల్పోయి జారిపడుతున్నాయి. దీంతో తీరప్రాంతం కోతకు గురవుతుండడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నదీతీరం కోతకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



జారిపడిన బండరాళ్లు



జారిపడుతున్న మట్టి పెళ్లలు

క్లుప్తంగా

తల్లికి తనయ తలకొరివి


అంత్యక్రియలు నిర్వహిస్తున్న ముద్ర సత్పతి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో సీనియర్ జర్నలిస్ట్ హరిహర సత్పతి సతీమణి కుంతల కుమారి సత్పతి (56) మృతి బుధవారం చెందింది. అంత్యక్రియల కోసం డీఎన్‌కే శ్మశానాకి తీసుకెళ్లారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. మృతురాలి చిన్న కుమార్తె లోప ముద్ర సత్పతి ముఖాగ్ని పెట్టడానికి ముందుకు వచ్చి ముఖాగ్ని పెట్టింది. జిల్లాలోని మేధావులు, సంఘ సంస్కర్తలు హర్షం వ్యక్తం చేశారు.

నీట్ పీజీ టాపర్‌గా పూషన్ మహాపాత్రో


పూషన్ మహాపాత్రో

భువనేశ్వర్: నీట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలో కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజీకి చెందిన పూషన్ మహాపాత్రా జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్టు


రాయగడ రైల్వే స్టేషన్ వద్ద గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరిని రైల్వే, అబ్కారీశాఖ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 23.140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కంధమాల్ జిల్లాకు చెందిన నివేదిత్ శెఠి, సుభస్మిత డెహురి ఉన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు స్థానిక అబ్కారీ సిబ్బంది, రైల్వే పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడు చేపట్టారు. ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేశారు. అందులో గంజాయి పట్టుబడింది. యువకుడు, యువతి ఈ గంజాయిని బెంగుళూరు తరలించేందుకు రైల్వే స్టేషన్ వద్ద వేచి ఉన్న సమయంలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డారు.

మునిగుడలో..


జిల్లాలోని మునిగుడ రైల్వే స్టేషన్‌లో బుధవారం అబ్కారీ, రైల్వే పోలీసులు నిర్వహించిన దాడుల్లో 45 కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జయపురం: స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ యువతకు మార్గదర్శకులని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. బుధవారం రాజీవ్‌గాంధీ 81వ జన్మదినోత్సవాన్ని స్థానిక కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొరాపుట్ జిల్లా మైనారిటీవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు హసన్ మదాని మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ యువతరానికి మార్గదర్శకులన్నారు. ప్రధాన మంత్రిగా దేశానికి, ముఖ్యంగా పేద, బడుగు వర్గాల ప్రజల ఆర్థిక సామాజిక ఉన్నతికి పలు పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. పేదరిక నిర్మూలనకు ఆయన చేపట్టిన పథకాలు నేటికీ ప్రజలు మరువలేనివని అన్నారు. నేటి యువత రాజీవ్‌గాంధీ అడుగు జాడలలో నడచి దేశ సమగ్రతకు, సమైఖ్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ జయపురం ప్రతినిధి కృష్ణ చంద్రనేపక్, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కాంత పాఢీ, కొరాపుట్ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు రామ నాయిక్ పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


రామారావు మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం గ్రామ పంచాయతీ చిన హంస గ్రామానికి చెందిన లండ రామారావు అనే వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఒడిశాలోని రాధా సాగరంలో రామారావు గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఒడిశా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృత్యువాతపడడంతో భార్య లక్ష్మి రోదనలు మిన్నంటాయి.

మహాత్ముని బాటలో పయనిద్దాం

- సత్యం, అహింస, కరుణతో సుసంపన్న సమాజం సాధ్యం
- స్మారకోత్సవంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు


ఆశ్రమవాసులను అభినందిస్తున్న రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి


శత వసంతాల స్మారక కార్యక్రమంలో పాల్గొన్న ఆశ్రమవాసులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్

భువనేశ్వర్ : మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, అహింస, కరుణను ఆదర్శంగా స్వీకరించి నైతిక పద్ధతుల్లో సుసంపన్న సమ్మిళిత సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రజలకు పిలుపునిచ్చారు. కటక్ నువా బజారు ప్రాంతంలో ఆసియాలోనే అతి పెద్ద కుష్టు ఆశ్రమానికి గాంధీ చేపట్టిన పాదయాత్రకు శత వసంతాలు పూర్తయిన నేపథ్యంలో బుధవారం స్మారక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆశ్రమం కేవలం చికిత్సకు కేంద్రం మాత్రమే కాదని, వైద్యం, ఆశ, మానవ గౌరవానికి నిలయమని పేర్కొన్నారు. వైజ్ఞానికత, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంతో భారత దేశం ముందుకు సాగుతున్న తరుణంలో మౌలిక మానవ విలువల పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించాలని చెప్పారు. యుద్ధాలు, విభజనలు విచ్ఛిన్నతలు కాకుండా సరళత, కరుణ, అహింసతో జీవించడాన్ని గాంధీజీ నుంచి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వందేళ్ల కిందట 1925లో మహాత్ముడు కుష్టు ఆశ్రమానికి చేపట్టిన పాదయాత్రను నైతిక తీర్థ యాత్రగా అభివర్ణించా రు. కుష్టు రోగులను అవమానించి, వారిని అణగ దొక్కే సమయంలో గాంధీ వారి పట్ల సానుభూతి, గౌరవంతో ముందడుగు వేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం సమాజాంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, ఇతర బాధితులను వివక్షతో చూడటం మానుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో గవర్నర్ మహాత్మా కుష్టు సేవా స్మృతి వనం ప్రారంభించారు.

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, పార్లమెంటరీ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం కుష్టు రోగులకు ఆధునిక చికిత్సతో కృత్రిమ అవయవాలు, పునరావాసం సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కటక్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ భర్తృహరి మహతాబ్ మాట్లాడుతూ స్వేచ్ఛ అందరికీ ఒకటేనన్నారు. దళితులు, అణచివేతకు గురైనవారు, అణగారిన వర్గాలకు సమాన స్వేచ్ఛను అందించాలనేది మహాత్ముని కల అని చెప్పారు. కార్యక్రమంలో కటక్ నగర పాలక సంస్థ (సీఎంసీ) మేయర్ సుభాష్ చంద్ర సింగ్, చౌద్వార్ కటక్ ఎమ్మెల్యే సౌవిక్ బిస్వాల్, కటక్ సదర్ ఎమ్మెల్యే, ఇంజినీర్ ప్రకాష్ చంద్ర సెఠి, కటక్ జిల్లా మేజిస్ట్రేట్ దత్తాత్రేయ భౌసాహెబ్ షిండే, కటక్ నగర పాలక సంస్థ (సీఎంసీ) కమిషనర్ కిరణ్‌దీప్ కౌర్, నయన్ కిషోర్ మహంతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరాలి

- రాష్ట్ర నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్ గిరీష్


మాట్లాడుతున్న గిరీష్ పక్కనే జిల్లా కలెక్టర్ కులకర్ణి, గుణుపూర్ సబ్ కలెక్టర్ దిల్లిప్

రాయగడ: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఎస్.ఎన్.గిరీష్ అన్నారు. గత మూడు రోజులుగా జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్, పద్మపూర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, గుణుపూర్ సబ్ కలెక్టర్ దుదాల్ అభిషేక్ దిల్లిప్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ తదితరులు పాల్గొని వివిధ పథకాలపై సమీక్షించారు. ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సౌకర్యాల గురించి ఆరా తీశారు. గోపబంధు జన ఆరోగ్య పథకం, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జనారోగ్య పథకాల గురించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామీణ అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో నిర్మిస్తున్న వంతెనల పనితీరు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా, శిశు సంరక్షణకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలు గురించి వైద్యశాఖ అధికారులను అడిగారు. ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల ఆరోగ్య భద్రత, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి చర్చించారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ కలకర్ణి పక్కనే ఎస్పీ స్వాతి, తదితరులు

రాయగడ: జిల్లాలో ఇటీవల పెరుగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి సంబంధితశాఖ అధికారులకు ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశంలో ఈ మేరకు జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్. కుమార్, డీఎఫ్ఓ అన్నా సాహేబ్ అహోలే, గుణుపూర్ సబ్ కలెక్టర్ దుధుల్ అభిషేక్ దిల్లిప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కులకర్ణి అధికారులతో మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జిల్లాలో పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా అధికారులు విస్తృతంగా దాడులను నిర్వహించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా సాగవుతున్న గంజాయిని రూపుమాపాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగు వంటి సంఘ విద్రోహక చర్యలు చేపడితే చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. వారికి జీవనోపాధికి మార్గం సుగమమం చేయగలిగితే గంజాయి వంటి సాగుకు వారు దూరంగా ఉంటారని అభిప్రాయపడ్డారు.

రెండు ప్రైవేట్ చిల్డ్రన్ హోమ్స్ రద్దు


బి.సీతాపురంలో గుడ్ న్యూస్ ఇండియా డ్రీమ్ సెంటర్ భవనం డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

- బాలలను ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు


రెండు ప్రైవేట్ బాలబాలికల వసతి గృహాలు నిషేధించిన తర్వాత డి.సి.పి.యు. అరుణ్ త్రిపాఠిని కలిసిన బాలల తల్లిదండ్రులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గుసాని సమితిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ చిల్డ్రన్ హాస్టల్స్, హోమ్స్‌ను జిల్లా కలెక్టర్ మధుమిత నిషేధిస్తూ బుధవారం ఉత్తర్వుల జారీ చేశారు. జిల్లా అధికారుల బృందం బాలల సంక్షేమ కమిటీ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా ముఖ్య విద్యాధికారి డాక్టర్ మాయాధర్ సాహు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ గుసాని సమితి బి.సీతాపురంలో గుడ్ న్యూస్ ఇండియా అలియాస్ డ్రీమ్ సెంటర్, అంబాజరి మెట్టు గ్రామంలో న్యూ హోప్ చిల్డ్రన్ హోమ్‌ను సందర్శించి హాస్టల్ ఓనర్‌షిప్ కాగితాలు లేనందున రెండింటిపై చర్యలు తీసుకున్నారు. ఈ రెండు హాస్టళ్లలో 68 బాలబాలికలు ఉన్నారు. వీరిని పునరావాసం కింద ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ బాలికల వసతి, కస్తూర్బా గాంధీ సంక్షేమ హాస్టల్, అర్బన్ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ (పర్లాకిమిడి), ఉత్కల్ బాలాశ్రమానికి తరలించారు. దీనిపై జిల్లా బాలల సంరక్షణ అధికారి (డి.సి.పి.యు.) అరుణ్‌కుమార్ త్రిపాఠి విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో గుసాని సమితిలో రెండు నిషేధిత బాలల హాస్టల్స్‌పై నిషేధించడమే కాకుండా ఇంకెక్కడైనా ఇలా ప్రభుత్వ అనుమతి లేని బాలబాలికల వసతులు వుంటే వాటిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఇప్పిలి సతీష్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పైడిభీమవరం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న సమయంలో, కనిమెట్ట గ్రామానికి చెందిన ఇప్పిలి సతీష్ అనే వ్యక్తి మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ ఎస్.చిరంజీవి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు

టెక్కలి: కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల వాటాలో 50 శాతం మాత్రమే తీసుకుని మిగిలినది నగదు రూపంలో కూటమి ప్రభుత్వం లాగేసుకుందని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రికి అనుకూలంగా ఉన్న బ్రోకర్ల వద్ద బ్లాక్ మార్కెట్‌లో ఎలా ఎరువులు దొరుకుతున్నాయో మంత్రి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018లో తిత్లీ తుఫాన్ సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అప్పటి మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినా ఇంతవరకు సాయం అందలేదన్నారు.

కొనసాగుతున్న భారీ వర్షాలు


తాడు సహాయంతో నది దాటుతున్న గ్రామీణ ప్రజలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో కుండపోత వర్షాలు పడుతున్నాయి. గత 48 గంటలలో దాదాపు 300 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. దీంతో నదులు, కొండవాగలు పొంగి పొర్లుతున్నాయి. విరామం లేకుండా వర్షాలు పడుతుండటం వలన బొయిపరిగుడ సమితి బలిగాం పంచాయతీలో కంగుగుడ గ్రామం వద్దగల నది నీటి ప్రవాహంతో పొంగిపొర్లుతోంది. దీంతో నదీ ప్రరివాహిక ప్రాంతంలోని కంగుగుడ, అటల్‌గుడ, జలియగుడ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆ నదిపై వంతెన లేక పోవటంతో కంగుగుడ, అటల్‌గుడ, జలియగుడ ప్రజలు తాడు సాయంతో ప్రమాదకరంగా నదిని దాటుతున్నారు. కంగుగుడ గ్రామం వద్ద గల నదిపై వంతెన నిర్మించాలని తాము ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవటవలేదని వారు తెలిపారు. సాధారణ రోజులలో నది దాటడానికి కష్టం కాదని, అయితే వర్షాకాలంలో నదిలో వరదపొంగి పొర్లుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

కూనకు మతి భ్రమించింది

- ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారు
- దళిత మహిళను వేధించడం నిజమా.. కాదా..!
- వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ ధ్వజం


ఎమ్మెల్యే కూన ఫొటోలను మీడియాకు చూపిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మతి భ్రమించిందని, ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూన తాను హరిశ్చంద్రుడు, శ్రీరామచంద్రుడు అంటూ దేవుళ్లతో పోల్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారని ఇద్దరు వ్యక్తులను పంపించి తనకు లొంగిపోవాలని ఆదేశించారని లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య పత్రికా ముఖంగా తెలియజేశారన్నారు. ఆమె ఆరోపణలకు ఎమ్మెల్యే నిర్దోషితత్వాన్ని నిరూపించుకోవాల్సింది పోయి వైఎస్సార్ సీపీపై లేనిపోని ప్రేలాపనలు చేయడం సరికాదన్నారు. ఒంటరి దళిత మహిళ, ఉన్నత విద్యావంతురాలిని వేధించడం నిజమా.. కాదా అని ప్రశ్నించారు. ఆమెపై వేధింపులకు సాక్ష్యాలు అడగటం సరికాదని, ఎవరైనా మహిళలను వేధిస్తుంటే వీడియోలు, ఫొటోలు తీసి సాక్ష్యాలుగా ఉంచుకుంటారా అని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులతో సాయంత్రం ఐదు గంటల తర్వాత అర్ధరాత్రి వరకు సమీక్షా సమావేశాలు పెట్టమని ఏ ప్రివిలేజ్ కమిటీ చెప్పిందో ఎమ్మెల్యే తెలియజేయాలని డిమాండ్‌చేశారు. సౌమ్యను నిజంగా వేధించకపోతే ఎమ్మెల్యే ఆఫీసులో ఆ రోజు జరిగిన ఘటనల సీసీటీవీ ఫుటేజీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నిబద్ధతగల నాయకుడైతే జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబును కోరాలన్నారు. తనకు డిగ్రీలు ఇప్పించానని కూన అసత్య వ్యాఖ్యలు చేయడంపై క్రిమినల్ కేసు పెట్టి సివిల్ సూట్ వేస్తానని రవికుమార్ హెచ్చరించారు. కూన రవికుమార్ ఇంటర్‌లో 12 సబ్జెక్టులు ఫెయిలయ్యారని, తర్వాత ఇంజినీరింగ్‌లో కాపీ కొట్టి పాస్ అయ్యారని తెలిపారు. ఇసుక, అక్రమ భూదందా, మహిళలను వేధించడం వంటి ఆకృత్యాలకు పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. పలువురు మహిళలతో ప్రత్యేక టూర్లకు వెళ్లడం కూన రవికుమార్ హాబీ అని ఆరోపించారు. ఒంటిమిట్ట ఆలయానికి ఓ మహిళతో వెళ్లి ఆమెను కుటుంబ సభ్యురాలుగా చెప్పి కూర్చొని పూజలు చేయించడం గుర్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వేరే మహిళలతో ఎలా అసభ్యకరంగా వ్యవహరిస్తుంటారో సంబంధిత ఫొటోలను చూపించారు. అయితే మహిళల పట్ల ఉన్న గౌరవంతో వారి ముఖాలను చూపించడం లేదన్నారు. ఇప్పటికైనా మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, ఆమదాలవలస మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.

వంశధార చెంత.. తాగునీటికి చింత..!

- కడుము గ్రామాన్ని వేధిస్తున్న తాగునీటి సమస్య
- వంశధార పక్కనే ఉన్నా గుక్కెడు నీటికి ఇబ్బంది
- చెలమ నీటితో అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వంశధార నదిలో చెలమ నీరు తోడుతున్న గ్రామస్తులు


కొత్తూరు:

తరాలు మారుతున్నా ఆ గ్రామ ప్రజల తలరాత మారడం లేదు. వంశధార నది నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఉద్దానం ప్రాంత గ్రామాలకు తాగునీటిని తరలిస్తున్న ఈరోజుల్లో, నది చెంతనే ఉన్నా గొంతెండుతున్న పరిస్థితి వారిది. పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గుక్కెడు నీటికోసం చెలమ వైపు చూస్తున్నారు మండలంలోని ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో ఉన్నటువంటి కడుము గ్రామం ప్రజలు. ఈ గ్రామంలో సుమారు 2,500 మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ఎన్నో ఏళ్లుగా మహిళలు వంశధార నది వద్దకు వెళ్లి చెలమ నీటిని బిందెల్లో తోడుకొని ఇళ్లకు తీసుకొని వెళ్తుంటారు. నదికి వరదలు వచ్చినట్లయితే చెలమ నీటికి సైతం అవకాశం ఉండదు. అటువంటి సమయంలో గ్రామానికి రెండు కి.మీ దూరంలో ఉండే ఒడిశా రాష్ట్రంలోని కిడిగాం గ్రామం బోరు నుంచి తాగునీటిని తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గ్రామంలో ఉన్నటువంటి పంచాయతీ బోర్లు నుంచి వచ్చే నీరు తాగేందుకు ఉపయోగపడడం లేదని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెలమ నీటినే తాగడం వలన అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. తమ గ్రామానికి సుజల ధార పథకంలో భాగంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


బిందెలతో ఇంటికి కాలినడకన వెళ్తున్న మహిళలు

చర్యలు తీసుకుంటాం

కడుము గ్రామంలో ఇంటింటా కుళాయిలు వేసేందుకు ఉద్దానం ఫేజ్–2 పథకం నుంచి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరలో చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాగర్,
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ, కొత్తూరు మండలం

రెండు కి.మీ నడుస్తున్నాం



గ్రామంలో ఉన్న బోర్లు నుంచి వస్తున్న నీరు తాగేందుకు పనికి రావడం లేదు. దీంతో రానుపోను రెండు కి.మీ నడిచి నది వద్దకు నీటికోసం వస్తాము. వర్షాలు కురుస్తున్నా తాగునీటి కోసం నదికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– కొల్లారి శ్రీదేవి, కడుము గ్రామం, కొత్తూరు మండలం

పట్టించుకోవడం లేదు



మా గ్రామానికి తాగునీటి కోసం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఊట నీరు కలుషితమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో ఆ నీరే తాగుతున్నాం. గ్రామంలో ఉన్న బోర్లు నుంచి వస్తున్న నీరు బాగులేకపోవడంతో ఊట నీరే మాకు దిక్కవుతోంది. అధికారులు స్పందించి తాగునీటి ఏర్పాట్లు చేయాలి.

– లంక పార్వతి,
కడుము గ్రామం, కొత్తూరు మండలం

వరదలు వస్తే ఒడిశా వెళ్లాలి



వర్షాకాలంలో వంశధార నదికి వరద వచ్చినట్లయితే ఊట నీరు ఉండదు. అప్పుడు మా గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రం కిడిగాం గ్రామం సమీపంలో ఉన్న బోరు నుంచి తాగునీరు తీసుకొస్తాము. మేము తాగునీటి కోసం పడుతున్న కష్టాలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బూరాడ స్వాతి,
కడుము గ్రామం, కొత్తూరు మండలం

క్లుప్తంగా

బోల్తా పడిన లారీ



పంట పొలాల్లో బోల్తాపడిన లారీ

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామం వద్ద జాతీయ రహదారి 26పై మానాపురం నుంచి విజయనగరం వస్తున్న లారీ అదుపు తప్పి పంట పొలాల్లో బుధవారం బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని లారీని బయటకు తీసే చర్యలు చేపట్టారు.

15 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ పరిధి జి.శివడ పంచాయతీ పెద్ద అంటిజోల గ్రామసమీపంలో అక్రమంగా సారా విక్రయిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు బుధవారం నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 లీటర్ల సారాను ఓ వ్యక్తి కలిగి ఉండడంతో సారా స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా సారా వంటకాలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- మంచం పడుతున్న ప్రజలు



దొర్లతాడివలసలో జ్వరంతో బాధపడుతున్న మహిళ

సాలూరు: వర్షాలు తెరిపిచ్చిన క్రమంలో నియోజకవర్గంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా వైరల్, మలేరియా, టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. గిరిశిఖర దొర్లతాడివలస, జాకరవలస, మూలతాడివలస, కుంబిమడ తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. తీవ్రజ్వరాలతో బాధపడుతున్నా మెడికల్ క్యాంపులు నిర్వహించకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న దొర్లతాడివలసకు చెందిన మధుసూదనరావును విజయనగరం ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో సుమారు ఏడాది కాలానికి పైగా ఏసీఎం ద్రావణం పిచికారీ చేయలేదని గిరిజనులు అంటున్నారు. ఈ కారణంగా గ్రామాల్లో దోమలు అధికమయ్యాయని, ఫలితంగా జ్వరాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో వైద్యశిబిరం ఏర్పాటు

గిరిజనులు అనారోగ్యాలతో బాధపడుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించి వెంటనే వైద్య శాఖాధికారులకు ఆదేశాలు జారీచేయడంతో దొర్లతాడివలసలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దొర్లతాడివలస, జాకరవలసకు చెందిన 44 మందికి వైద్యపరీక్షలు చేసి మెరుగైన చికిత్స నిమిత్తం పలువురిని తోణాం పీహెచ్‌సీకి తరలించారు.

నూతనబార్ పాలసీ విధానంలో ఫీజుల తగ్గింపు

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన బార్ పాలసీ విధానంలో లైసెన్స్ ఫీజులు భారీగా తగ్గించినట్లు జిల్లా మద్యనిషేధ, అబ్కారీ శాఖ అధికారి బి.శ్రీనాథుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత బార్ పాలసీ విధానంతో పోల్చితే లైసెన్స్ దారుడికి అనేక రాయితీలు లభిస్తాయన్నారు. లాటరీ పద్ధతిలో దరఖాస్తు విధానంతో పాటు ఒక వ్యక్తికి ఒకటికి మించి బార్లు కేటాయింపు, ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకూ బార్ పనివేళలు ఉంటాయన్నారు. ఆరు వాయిదాల్లో లైసెన్స్ ఫీజు చెల్లింపు చేసుకోవచ్చని, ఐఎమ్ఎల్, బీర్ అమ్మకాలు జరిగిన తదుపరి రెండు నెలల తర్వాత చెల్లింపులు చేయవచ్చన్నారు.

సాయికిరణ్‌కు కన్నీటి వీడ్కోలు



సాయికిరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన గండ్రేటి సాయికిరణ్(20) మంగళవారం కాకినాడలో నిర్వహించిన అగ్నిపథ్ (ఆర్మీ) ర్యాలీలో 1600 మీటర్ల పరుగుపందెంలో కుప్పకూలి ప్రాణాలు విడిచారు. సాయికిరణ్ మృతదేహం బుధవారం వేకువజామున స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సాయికిరణ్ అంతిమయాత్రలో గ్రామస్తులతో పాటు, చుట్టుపక్క గ్రామాల ప్రజలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయికిరణ్ మృతదేహంపై ఆర్మీ క్యాప్, వస్త్రాన్ని ఉంచారు.

రైతుకు లేని బీమా ధీమా

- ప్రీమియం చెల్లించడానికి ముందుకు రాని రైతులు
- పంటల బీమాకు కేవలం 295 దరఖాస్తులు
- ముగిసిన గడువు
- ఉచిత పంటల బీమాకు కూటమి సర్కార్ మంగళం



గంట్యాడ మండలం రామవరం గ్రామంలో సాగులో ఉన్న వరి పంట

ఖరీఫ్‌లో ఈనెల 18వతేదీ నాటికి సాగైన పంటల వివరాలు

పంట రకం	సాధారణం (హెక్టార్లలో)	సాగైంది (హెక్టార్లలో)
వరి	91,214	57805
జొన్న	01	05
మొక్కజొన్న	12386	9724
పెసర	66	04
మినుము	117	15
కంది	11	00
వేరుశనగ	369	46
నువ్వులు	5585	3937
పత్తి	2,142	1663
గోగు	306	15
చెరుకు	4720	2278

విజయనగరం ఫోర్ట్: వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఏవిధంగా ఉంటాయో తెలియని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. నిన్న మొన్నటి వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండిపోయాయి. గడిచిన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికశాతం పంటల సాగు వర్షాధారంగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో పంటలు పండేవరకు నమ్మలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ కూటమి సర్కార్ రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు సంక్షేమానికి పాటు పడతామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రైతులకు మేలు చేయడం మాట దేవుడెరుగు. ఉన్న ఉచిత పంటల బీమా పథకానికే కూటమి సర్కార్ చేతులెత్తేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రైతులు చెల్లించాల్సిన పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించింది. రైతు పంటలు సాగు చేసి ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే చాలు. ఈక్రాప్ ఆధారంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించేది. పంటనష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో చెల్లించింది.

గత ఏడాది రబీనుంచి రైతులదే బీమా చెల్లింపు

గత ఏడాది రబీ నుంచి రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని కూటమి సర్కార్ చెప్పేసింది. దీంతో రైతులు రబీసీజన్‌లో అపరాలకు, మొక్కజొన్నకు పంటల బీమా ప్రీమియం చెల్లించారు.

పంటల బీమాకు రైతులు దూరం

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల బీమాకు దూరంగా ఉన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లించాల్సి రావడంతో రైతులు బీమా ప్రీమియం చెల్లించడానికి ముందుకు రావడం లేదు. లక్షలాది మంది రైతులు ఉన్నప్పటికీ కేవలం 295 దరఖాస్తులే పంటల బీమా కోసం వచ్చాయి. వరి పంటకు ఎకరాకి రూ.200, మొక్కజొన్నకు రూ.165 నువ్వు పంటకు రూ.65 చొప్పన ప్రీమియం చెల్లించాలి.

ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 25 ప్రైవేటు ఐటీఐలలో ఆగస్టు 2025 సెషన్ మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కన్వీనర్ టి.వి.గిరి బుధవారం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం వచ్చిన యూనిక్ నంబర్‌తో ఈ నెల 27వ తేదీలోపు సమీప ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరై వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలకు ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐలకు ఈ నెల 30న కౌన్సెలింగ్ జరగనుందన్నారు. అభ్యర్థి ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెల్డర్, ప్లంబర్ ట్రేడ్లకు 8వ తరగతి, మిగతా ట్రేడ్లకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 98491 18075, 98499 44654, 77806 58035 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్యకళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీమాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు రూ.100 దరఖాస్తు రుసుముతో సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. తదుపరి ఎంపీసీ, చివరి ప్రాధాన్యం ఇతర గ్రూపుల వారికి ఇవ్వనున్నట్లు చెప్పారు.

పేకాట ఆడుతున్న ఇద్దరు కార్పొరేటర్ల అరెస్ట్



పేకాటరాయుళ్ల అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: పేకాట ఆడుతుండగా ఇద్దరు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సై కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్టేషన్ క్రైమ్ పార్టీ నైట్‌డ్యూటీలో భాగంగా పేకాటరాయుళ్లను పట్టుకున్నారన్నారు. తమ స్టేషన్ పరిధిలోని మంటపం వీధిలో మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు బంగారు నాయుడు, రంగ.రామకృష్ణలతో పాటు స్వాతికుమార్, భాస్కర్, తాడి సురేష్, నాగేంద్రలను పట్టుకున్నామన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు. పట్టుబడిన పేకాటరాయుళ్ల దగ్గర నుంచి రూ.48 వేల 810 నగదుతో పాటు 8 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా శ్రీరామ పునర్వసు పట్టాభిషేకం

- ప్రత్యేక పూజలు జరిపించిన అర్చకులు



యాగశాలలో సుందరకాండ హవనం జరిపిస్తున్న అర్చకులు



స్వామి సన్నిధిలో పునర్వసు పట్టాభిషేక పూజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం జరిపించారు. అనంతరం ఆలయంలోని వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణ వేడుకను కనులపండువగా నిర్వహించారు. ఆస్థాన మంటపంలో ఉత్సవమూర్తుల వద్ద రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్నవించి, స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ వై. శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఏపీస్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లమో ఎలైడ్ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్‌లో ఏ గ్రూప్‌లో పాస్ అయిన విద్యార్థులైనా అర్హులేనని పేర్కొన్నారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అత్తా,కోడళ్ల ఘర్షణలో అత్త మృతి



మృతిచెందిన అప్పలకొండ (ఫైల్)

జామి: అత్తా,కోడళ్ల మధ్య తలెత్తిన స్వల్ప వివాదం ఘర్షణకు దారితీయడంతో కోడలు తోసివేయడంతో అత్త మృతిచెందింది. ఈ ఘటనపై సీఐ ఎల్.అప్పలనాయుడు, మృతురాలి కుమారుడు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జేడీ వలస గ్రామానికి చెందిన గూనురు అప్పల కొండకు ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు అప్పారావు, కోడలు రాజమండ్రిలో ఉండేవారు. అప్పారావు అనారోగ్యంతో మృతిచెందడంతో భార్య లక్ష్మి అత్త వారిల్లు అయిన జేడీ వలస గ్రామానికి వచ్చి ఉంటోంది. ఇటీవల కొద్దిరోజుల క్రితం పుట్టినిల్లు డెంకాడ వెళ్లి బుధవారం మళ్లీ జేడీ వలస వచ్చింది. వచ్చిన కొంత సమయం తరువాత అత్త గూనురు అప్పలకొండ (72), కోడలు లక్ష్మి మధ్య వివాదం తలెత్తడంతోఘర్షణ పడ్డారు.ఈ ఘర్షణలో అత్తను లక్ష్మి చేతితో తోసివేయడంతో మంచం మీదనుంచి కిందకు పడిపోయి స్పృహ కోల్పోగా కుటుంబసభ్యులు జామి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో తిరిగి మృతదేహాన్ని జేడీ వలస గ్రామానికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై మృతురాలి రెండవ కుమారుడు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్సై వీర జనార్దన్ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్.కోట సామాజిక ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

అనుమానాస్పదంగా వివాహిత..



ఉరివేసుకుని మృతి చెందిన సాయిసుధ

గజపతినగరం రూరల్: మండలంలోని పిడిశీల గ్రామానికి చెందిన కర్రోతు సాయిసుధ మంగళవారం తన ఇంట్లో ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీర కట్టుకుని ఉరివేసుకున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులతో ఎంతో ఆనందంగా గడిపేదని భర్త, పిల్లలతో సరదాగా ఉన్న ఆమె ఒక్కసారిగా ఇంత పనిచేస్తుందని అనుకోలేదని స్థానికుల సమాచారం మేరకు తెలిసిందన్నారు. మృతురాలి తల్లి పిల్ల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానా స్పద మృతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం అనందరం వచ్చిన నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నామన్నారు.

రాజాంలో శతాధిక వృద్ధురాలు..



మృతిచెందిన శతాధిక వృద్ధురాలు గున్న రాజమ్మ

రాజాం సిటీ: పట్టణ పరిధి బుక్కా వీధికి చెందిన శతాధిక వృద్ధురాలు మండా గున్న రాజమ్మ(105) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆమె నిన్న మొన్నటి వరకు ఆరోగ్యంగానే ఉన్నారని, ఆహారం కూడా తీసుకునేదని కుటుంబసభ్యులు తెలిపారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కోడళ్లు, ఇద్దరు మనుమలు, ఐదుగురు మునిమనుమలు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలకు నిబంధనలు తప్పని సరి

- డీపీఓలో నేర సమీక్షా సమావేశం



డీపీఓలో జరిగిన నేరసమీక్ష సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు

విజయనగరం క్రైమ్: గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఇప్పటి నుంచే బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశించారు. గణేష్ మంటపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉత్సవ కమిటీలకు మాత్రమే అనుమతులు మంజూరు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక డీపీవోలో జరిగిన సమావేశంలో ఎస్పీ అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహించారు. కోర్టుల్లో ట్రయల్ రన్ కేసులపై దృష్టి పెట్టాలని ప్రాసిక్యూషన్ జరుగుతున్న తీరుపై కోర్టు కానిస్టేబుల్‌తో పాటు ఎస్సైలు, సీఐలు దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో బాధితురాలి వయస్సు నిర్ధారించాలంటే కచ్చితంగా తహసీల్దార్ లేదా పంచాయతీ అధికారి నుంచి అధికరణ ధ్రువీకరణ పత్రం కచ్చితంగా ఉండాలన్నారు. అలాగే కేసు తీవ్రతను బట్టి ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష విధించిన కేసుల్లో దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఇక స్కూల్స్, కళాశాలల్లో ఈగల్ క్లబ్స్, శక్తి వారియర్ టీమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆయా కళాశాలల్లో విద్యార్థినులు ఆత్మ రక్షణ పొందేందుకు స్పెషల్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను పెట్టుకోవాలని సూచించారు. రాత్రి పూట గస్తీ తిరిగే సిబ్బంది రెండు షిఫ్టుల్లో పనిచేయాలన్నారు. టౌన్ న్యూసెన్స్ యాక్టును విధిగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచాలని, ఫైనాన్షియల్ లావాదేవీల కేసుల్లో కూడా సిబ్బంది చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

అనంతరం పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించి గంజాయి అక్రమాలు అరికట్టడం, చోరీలు నియంత్రించడం, లోక్ అదాలత్‌లో కేసులను త్వరితంగా పరిష్కరించిన సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యారెడ్డి, రాఘవులు, గోవింద, వీరకుమార్, న్యాయసలహాదారు పరశురామ్, సీఐలు చౌదరి, శ్రీనివాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల డోలీ మోతలు ఇంకెన్నాళ్లు?

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి



పిరిడి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళను పరామర్శిస్తున్న పుణ్యవతి

బొబ్బిలి రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని, ఇంకా ఎన్నాళ్లు ప్రమాదకరంగా గిరిజనులు ఈ డోలీ మోతలతో ఆస్పత్రుల్లో చేరాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె పుణ్యవతి పాలకులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొత్త బట్టివలస గిరిజన గ్రామానికి చెందిన నిండు గర్భిణి మంగళవారం డోలీ మోతతో పిరిడి పీహెచ్‌సీలో చేరిన విషయం విదితమే.బుధవారం పీహెచ్‌సీలో తల్లీబిడ్డలను పుణ్యవతి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధిలో మైదాన ప్రాంతాలకు పెద్దపీట వేసి గిరిజన గ్రామాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, ఆరోగ్యం, విద్యను పాలకులు అందించలేకపోతున్నారని విమర్శించారు. బట్టివలస గిరిజన గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న మంత్రి సంధ్యారాణికి ఇవేమీ పట్టడం లేదన్నారు. పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాలకే ఇటువంటి దుస్థితి వస్తే గిరి శిఖరాలపై నివసిస్తున్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని, డోలీ మోతల్లో తల్లీబిడ్డలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అనుకూలమైన వ్యక్తులకు కోట్లరూపాయల కాంట్రాక్టులను అప్పగించి మైదానప్రాంతాల్లో రోడ్లు వేసుకున్నారని, గిరిజన గ్రామాలపై పూర్తి వివక్షచూపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని లేనిపక్షంలో గిరిజన మహిళలను ఏకం చేసి ఆందోళన బాటపడతామని ప్రభుత్వాన్ని, పాలకులకు హెచ్చరించారు.

రైతు వ్యతిరేకి కూటమి సర్కార్

- ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్సీ పాలవలస మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: రాష్ట్రంలో కూటమి సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువుల సరఫరాలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల కేంద్రం వంగరలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేశామంటున్న సీఎం చంద్రబాబు చేతల్లో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఏ గ్రామంలో చూసినా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, యూరియా, డీఏపీ కొరత రైతన్నలను కలవరపెడుతోందన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎన్నడూ ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగానే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు తరలించి పూర్తిస్థాయిలో అన్నదాతకు ఎరువులను సరఫరా చేసే ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల పట్ల జగన్‌మోహన్‌రెడ్డి అనుసరించిన విధానాలు దేశానికే ఆదర్శమన్నారు. ఈ ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తున్న ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన దుర్భర పరిస్థితి నెలకొనడమే కూటమి సర్కారు పనితీరుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమా పథకం ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదని, ఇప్పుడు రైతు చెల్లించుకోవడమేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అన్ని వర్గాలకూ మోసం

వంగర మండలంలోని శివారు గ్రామాలకు తోటపల్లి సాగునీరు అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. రైతులు, పింఛన్ లబ్ధిదారులు, వికలాంగులు, యువత, విద్యార్థులు, ఉద్యోగులను చంద్రబాబు సర్కారు మోసం చేస్తోందంటూ కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ కేంద్రంలో ప్రగల్భాలు పలుకుతున్న నేతలకు ఆంధ్రప్రదేశ్‌లో రైతుల కష్టాలు పట్టడం లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ ఉత్తారావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీటీసీ కనగల పద్మ, సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, పార్టీ నాయకులు బొక్కెల వెంకటప్పలనాయుడు, కాంబోతుల శ్రీనివాస నాయుడు, పాలవలస ధవళేశ్వరరావు, పెంకి సంపత్‌కుమార్, కాంబోతుల రాము, గొండేల తవిటయ్య మాస్టారు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పడాలవలస గిరిజనుల తాగునీటి కష్టాలు

- పట్టించుకోని కార్యదర్శి
- పంటపొలాల నుంచి తాగునీరు సేకరణ



పంట పొలాలలో బోరు నుంచి పైపుల ద్వారా తాగునీరు పట్టుకుంటున్న గ్రామ మహిళలు



పడాల వలసలో బోరుబావికి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

సాలూరు రూరల్:

ఎక్కడైనా మండు వేసవిలో గిరిజన గ్రామాల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న సందర్భాలు ఎదురవుతుంటాయి. అయితే సాలూరు మండలంలోని మరిపల్లి పంచాయతీ పడాలవలస గిరిజన గ్రామ ప్రజలు వర్షాకాలంలో కూడా గడిచిన 10 రోజులుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని బోరు బావి మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో పక్కనే ఉన్న పంటపొలాల్లో బోరు బావినుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నందున తెల్లవారేసరికి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ తాగునీటి కోసం కొంత సమయం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంటోందని గిరిజన మహిళలు వాపోతున్నారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శికి సమస్యను వివరించినప్పటికీ తాను చేసేది ఏమీ లేదని నాయకులను కలవాలని చెబుతున్నట్లు గ్రామస్తులు వివరించారు. ఈ క్రమంలో ఎలాగోలా బోరు బావికి మరమ్మతులు చేయాలని బుధవారం గ్రామంలోని కొంతమంది యువకులు ప్రయత్నించి పైపులు బయటకు తీశారు. అయితే బోరు మరమ్మతులకు కొన్ని కొత్త సామగ్రి అవసరమవుతాయని గుర్తించిన యువకులు ఆ డబ్బులు ఎవరు పెడతారని, ఎక్కువ ఖర్చు అయితే అంత సొమ్ము ఎవరు భరిస్తారని చర్చించుకుని తాము పని విషయంలో సహకరిస్తామే తప్ప డబ్బులు పెట్టే స్తోమత తమకు లేదని ఎవరి దారి వారు చూసుకున్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య అలాగే ఉండి పోయింది. వెంటనే గ్రామ కార్యదర్శి బోరు బావికి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.